PRGI REGN NO: APTEL/26/A3695

నేటి మినిట్ టు మినిట్

తెలుగు దిన పత్రిక

NETI MINUTE TO MINUTE

TELUGU DAILY

సంపుటి: 01 సంచిక :112 ఎడిషన్ : అనంతపురము మరియు సత్యసాయి జిల్లా, తేది : బుధవారం - 07 అక్టోబర్ 2026, పేజీలు -4 వెల 1/-

VOLUME:01 ISSUE:112 EDITION: ANANTHAPURAMU, SATHYA SAI DIST. DATE: WEDNESDAY 07 OCTOBER 2026 PAGES: 04 RS:01/



ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలని ఇండియా బ్లాక్ డిమాండ్

న్యూఢిల్లీ, 6(నేటి మినిట్ టు మినిట్): 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి', 'సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి' అని డిమాండ్ చేస్తూ ఇండియా బ్లాక్ ఎంపీలు ఢిల్లీలో భారీ నిరసన చేపట్టారు. పార్లమెంట్‌లోని మకర్‌ద్వార్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం మిగతా2లో...

స్త్రీశక్తికి చారిత్రక మైలురాయి

- 100 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు
- మహిళలకు రూ.3,550 కోట్ల మేర ఆదా.. రోజుకు సగటున 24 లక్షల మంది వినియోగం
- మహిళలకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు





రవాణా రంగానికి సమగ్ర ప్రణాళిక

ఐటీఎల్‌పీ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ,అక్టోబర్ 6(నేటి మినిట్ టు మినిట్): రవాణా, లాజిస్టిక్స్ రంగాల్లో పరిశోధన, ప్రణాళిక, ప్రాజెక్టుల పరిశీలన, పర్యవేక్షణ కోసం ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ లాజిస్టిక్స్ అథారిటీ (ఐటీఎల్‌పీ) ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మిగతా2లో...

నైజీరియాలో కూలిన మిలిటరీ విమానం

ప్రమాదంలో 25 మంది మృతి.. ఒండో రాష్ట్రంలో ఘటన



ఇగ్బోకోడా, అక్టోబర్ 6(నేటి మినిట్ టు మినిట్): నైజీరియాలోని ఒండో రాష్ట్రంలో మిలిటరీ విమానం కుప్పకూలిన ఘటనలో 25 మంది ప్రాణాలు కోల్పోయారు. నైజీరియా వైమానిక దళానికి చెందిన ఏటీఆర్-42 విమానం బెనిన్ సిటీ నుంచి లాగోస్‌కు సాధారణ విధి నిర్వహణలో భాగంగా వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇగ్బోకోడా సమీపంలోని నావికాదళ స్థావరం వద్ద విమానం రాడార్‌తో సంబంధాలు కోల్పోయి నదీ ప్రాంతంలో కూలిపోయింది. విమానంలో ఐదుగురు సిబ్బంది, 20 మంది ప్రయాణికులు కలిపి మొత్తం 25 మంది ఉన్నట్లు నైజీరియా వైమానిక దళం వెల్లడించింది. అయితే ప్రమాదం జరిగిన వెంటనే నైజీరియా విమానయాన మంత్రి 25 మంది ప్రయాణికులు, ఏడుగురు సిబ్బందితో మిగతా2లో...



సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆపరేశ్ కుమార్

- తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న ఆయన బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ, 6(నేటి మినిట్ టు మినిట్): తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ ఆపరేశ్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయించారు. తాజా నియామకాలతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 37కి చేరింది. జస్టిస్ ఆపరేశ్ కుమార్ సింగ్ 2012లో జార్ఖండ్ హైకోర్టు

మిగతా2లో...

శ్రీశైలం శరన్నవరాత్రులకు చంద్రబాబుకు ఆహ్వానం

అక్టోబర్ 11 నుంచి 20 వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



అమరావతి,అక్టోబర్ 6(నేటి మినిట్ టు మినిట్): ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని దేవస్థానం అధికారులు, పాలక మండలి సభ్యులు ఆహ్వానించారు. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజులపాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహిం చేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. మంగళవారం ఉండవల్లి లోని సీఎం క్యాంపు కార్యాలయంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆలయ పాలక మండలి చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఈవో ఎం. శ్రీనివాసరావు, వేద పండితులు చంద్రబాబును కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు సీఎంకు వేదాశీర్వచనం అందించారు. అధికారులు స్వామి, అమ్మవార్ల చిత్రపటంతో పాటు మిగతా2లో...



గోరంట్లలో సొంత నిధులతో అన్న క్యాంటీన్

పేదల కడుపు నింపడమే లక్ష్యం : మంత్రి సవిత

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకునేది లేదు


శ్రీ సత్యసాయి, అక్టోబర్ 6(నేటి మినిట్ టు మినిట్): పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్లలో మంత్రి సవిత తన సొంత నిధులతో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్ఫూర్తితో ఈ క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. పేదలకు తక్కువ ఖర్చుతో భోజనం అందించడంతో పాటు వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్న క్యాంటీన్లను మూసివేసి పేదలపై భారం మోపారని మంత్రి సవిత విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా2లో...

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పోరాటం

- సుప్రీంకోర్టులో అవకాశం ఉంది కాబట్టే కోర్టుకు వచ్చాం : రామ్మోహన్ నాయుడు
- బీసీలకు 16,800 పదవులు దక్కుతాయి



న్యూఢిల్లీ,అక్టోబర్ 6(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో న్యాయపోరాటం కొనసాగిస్తోంది. రిజర్వేషన్ల కల్పనకు సుప్రీంకోర్టులో అవకాశం ఉందని, అందుకే న్యాయస్థానాన్ని ఆశ్రయించామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ అంశంపై మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో పాటు రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి న్యాయ నిపుణులతో చర్చలు జరిపారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని మరింత జటిలం చేయకుండా పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు అవసరమైన న్యాయపరమైన మార్గాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో చేర్చే అంశంపై ఇప్పటికే అనేక రాష్ట్రాలు ప్రయత్నాలు చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. **16,800 పదవులు** బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలైతే మిగతా2లో...



ముంచుకొస్తున్న కరెంటు కష్టాలు

- పడిపోతున్న జల, పవన విద్యుదుత్పత్తి.. బొగ్గు ప్లాంట్లలో నిర్వహణ పనులు
- అదనపు విద్యుత్ కోసం కేంద్రం వైపు రాష్ట్రాలు

న్యూఢిల్లీ,అక్టోబర్ 6(నేటి మినిట్ టు మినిట్): దేశంలోని పలు రాష్ట్రాల్లో విద్యుత్ సంక్షోభం ముదురుతోంది. జల, పవన విద్యుదుత్పత్తి తగ్గడం, కొన్ని బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లలో నిర్వహణ పనులు కొనసాగుతు ండటంతో విద్యుత్ సరఫరాలో కొరత ఏర్పడింది. దీంతో రాత్రి వేళల్లో పలు ప్రాంతా ల్లో విద్యుత్ కోతలు పెరుగుతున్నాయి. అదనపు విద్యుత్ కోసం రాష్ట్రాలు కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నాయి. రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, మిగతా2లో...

స్త్రీశక్తికి చారిత్రక మైలురాయి

అమరావతి,అక్టోబర్ 6(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న 'స్త్రీశక్తి' పథకం చారిత్రక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 100 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు చేసినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని మహిళలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళల ఆదరణ, మాతృమూర్తుల ఆమోదంతో 'స్త్రీశక్తి' పథకం ఈ కీలక ఘనతను సాధించిందని సీఎం పేర్కొన్నారు. 2025 ఆగస్టు 15న ప్రారంభమైన 'స్త్రీశక్తి' పథకం కింద ఎంపిక చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రారంభమైన ఏడాది వ్యవధిలోనే ఉచిత ప్రయాణాల సంఖ్య 100 కోట్ల మార్కును దాటడం పథకం వినియోగాన్ని తెలియజేస్తోందని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. **మహిళలకు ఆర్థిక భారం తగ్గింపు**'స్త్రీశక్తి' పథకం వల్ల మహిళలకు ప్రయాణ ఖర్చుల భారం గణనీయంగా తగ్గిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఇప్పటివరకు మహిళలు సుమారు రూ.3,550 కోట్ల మేర ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని తెలిపారు. ఆదా అయిన మొత్తాన్ని మహిళలు తమ పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు, భవిష్యత్ అవసరాలకు వినియోగించుకోవాలన్నదే ప్రభుత్వ ఆకాంక్షగా సీఎం వివరించారు. చదువుకునే విద్యార్థినులు, ఉద్యోగాలకు వెళ్లే మహిళలు, రోజువారీ ఉపాధి కోసం ప్రయాణించే వారు, వైద్యం కోసం వెళ్లే మహిళలు, స్వయం ఉపాధి కార్యక్రమాల కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లేవారికి ఈ ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగకరంగా మారిందని ప్రభుత్వం చెబుతోంది. ప్రజా రవాణా అందుబాటులోకి రావడంతో మహిళలు తమ అవసరాల కోసం మరింత స్వేచ్ఛగా ప్రయాణించే అవకాశం ఏర్పడిందని పేర్కొంది. **రోజుకు 24 లక్షల మంది ప్రయాణం**పథకం ప్రారంభమైన తర్వాత ప్రతిరోజూ సగటున 24 లక్షల మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారంటే 'స్త్రీశక్తి' పథకం మహిళల రోజువారీ జీవితంలో ఒక భాగంగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. మహిళల విద్య, ఉద్యోగం, ఉపాధి, వైద్యం, కుటుంబ అవసరాలు తదితర కార్యక్రమాలకు ప్రయాణం తప్పనిసరి కావడంతో ఉచిత బస్సు సౌకర్యం వారి ప్రయాణ వ్యయాన్ని తగ్గించడంలో తోడ్పడుతోందని అధికారులు తెలిపారు. మహిళల చలనశీలతను పెంచడంతో పాటు కుటుంబాలపై పడే ప్రయాణ ఖర్చు భారాన్ని తగ్గించడం పథకం ప్రధాన ఉద్దేశాల్లో ఒకటిగా పేర్కొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి అభినందనలు'స్త్రీశక్తి' పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంలో కృషి చేస్తున్న ఆర్టీసీ యాజమాన్యం, అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందికి చంద్రబాబు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మహిళలకు నిరంతరం మెరుగైన సేవలు అందేలా ఆర్టీసీ యంత్రాంగం పనిచేస్తోందని పేర్కొన్నారు. పథకాన్ని ఆదరిస్తున్న మహిళలందరికీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఈ పథకం అమలుకు ఆర్టీసీకి నిధులను అందిస్తోంది. అధికారిక వివరాల ప్రకారం పథకం అమలుకు ఇప్పటివరకు రూ.2,160 కోట్లు విడుదల కాగా, ప్రస్తుతం నెలకు సుమారు రూ.160 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తోంది.

'శభాష్ గాయత్రి'.. సీఎం అభినందనలుఇదే సందర్భంగా ద్వారకా తిరుమల నిత్యాన్నదాన కేంద్రంలో మానవత్వాన్ని చాటిన గాయత్రి అనే మహిళా సిబ్బందిని కూడా సీఎం చంద్రబాబు అభినందించారు. చేతులు లేని దివ్యాంగ భక్తుడికి ఆమె స్వయంగా అన్నం తినిపించి ఆకలి తీర్చిన ఘటనపై సీఎం స్పందించారు. దివ్యాంగ భక్తుడికి అన్నం తినిపించి సేవ చేసిన గాయత్రి సహృదయాన్ని చంద్రబాబు ప్రశంసించారు. 'మానవ సేవే మాధవ సేవ' అనే భావనను ఆమె తన సేవ ద్వారా చాటిచెప్పారని కొనియాడారు.

సమాజంలో మానవత్వం, సేవాభావం మరింత పెరగాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అందించే 'స్త్రీశక్తి' పథకం 100 కోట్లకు పైగా ప్రయాణాల మైలురాయిని చేరుకోవడం రాష్ట్ర ప్రభుత్వానికి కీలక ఘట్టంగా నిలిచిందని అధికారులు పేర్కొన్నారు. మహిళల ప్రయాణ అవసరాలకు ప్రజా రవాణాను మరింత అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వారి కుటుంబాలపై ప్రయాణ ఖర్చు భారాన్ని తగ్గించడమే పథకం లక్ష్యమని తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

(మొదటి పేజీ తరువాయి)

వరకు మార్చ్ నిర్వహించారు. 'ఓట్ చోర్.. గద్దీ చోడ్' అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ మార్చ్‌లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, సీపీఐ(ఎం) నేతలు అమ్రారామ్, జాన్ బ్రిట్టాస్, ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ, ఎన్‌సీపీ ఎంపీ సుప్రియా సూలే, ప్రియాంక గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఆకాశవాణి భవన్ సమీపంలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి మార్చ్‌ను అడ్డుకున్నారు. దీంతో ఎంపీలు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. బారికేడ్లు దాటి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొందరిని ఈడ్చుకెళ్లి పోలీసు వాహనాల్లోకి ఎక్కించారని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. సీపీఐ(ఎం) ఎంపీ ఎ.ఎ. రహీం గాయపడినట్టు ఆ పార్టీ నేతలు తెలిపారు. **ఓటు హక్కును కాపాడాలి**'ఎస్ఐఆర్' పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని ఇండియా బ్లాక్ నేతలు ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడాలని, తొలగించిన ఓట్లను తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని లేదా ఆయనను పదవి నుంచి తొలగించాలని కోరారు. సీపీఐ(ఎం) నేత జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. సీఈసీ విశ్వసనీయతను కోల్పోయిందని విమర్శించారు. ఎంపీలను అడ్డుకోవడం ద్వారా ప్రజాస్వామ్య హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం కార్యాలయానికి కొద్దిదూరంలో ఉన్న తమను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియ పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆందోళన నేపథ్యంలో ఢిల్లీలో భారీగా పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలను మోహరించారు. పలు ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించారు. ఇండియా బ్లాక్ నేతలు మాత్రం తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు.

నైజీరియాలో కూలిన మిలిటరీ విమానం

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 32 మంది ఉన్నట్లు ప్రకటించారు. అనంతరం వైమానిక దళం మృతుల సంఖ్యను 25గా నిర్ధారించింది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. **సమగ్ర దర్యాప్తునకు ఆదేశాలు** ప్రమాదంపై నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనకు గల కారణాలను గుర్తించేందుకు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాలని వైమానిక దళాన్ని ఆదేశించారు. ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. **మూడు రోజుల జాతీయ సంతాపం** మృతులైన వైమానిక దళ సిబ్బందికి గౌరవార్థం నైజీరియాలో మూడు రోజుల జాతీయ సంతాప దినాలను ప్రకటించారు. దేశవ్యాప్తంగా జాతీయ జెండాలను సగం వరకు అవనతం చేయాలని అధ్యక్షుడు ఆదేశించారు. ప్రమాదం అనంతరం సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు, సహాయక చర్యలు చేపట్టాయి.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆపరేశ్ కుమార్

(మొదటి పేజీ తరువాయి)

న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. 2025 జూలై 19న తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. తాజాగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.
జస్టిస్ ఆపరేశ్ కుమార్ సింగ్‌తో పాటు గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు.

శ్రీశైలం శరన్నవరాత్రులకు చంద్రబాబుకు ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

తీర్థప్రసాదాలను అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భ్రమరాంబికా అమ్మవారు ప్రతిరోజూ ఒక్కో విశేష అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో దేవస్థానం చేపడుతున్న ఏర్పాట్లపై ముఖ్యమంత్రి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై కూడా వివరాలు తెలుసుకున్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్, ఈవో, వేద పండితులు రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆయన నివాసంలో కలిసి శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవాలకు హాజరుకావాలని లోకేష్‌ను కూడా వారు కోరారు.

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక సంస్థల్లో సుమారు 16,800 పదవులు బీసీలకు దక్కే అవకాశం ఉందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇది కేవలం రాజకీయ అంశం కాదని, సామాజిక న్యాయానికి సంబంధించిన విషయమని స్పష్టం చేశారు. బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఇదిలా ఉండగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఏపీ హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 50 శాతం రిజర్వేషన్ పరిమితి విషయంలో తగిన గణాంకాలు, ఆధారాలతో ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతోంది. బీసీలకు రిజర్వేషన్లు దక్కకుండా వైసీపీ ప్రయత్నాలు చేస్తోందని రామ్మోహన్ నాయుడు ఆరోపించారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తోందని తెలిపారు.

రవాణా రంగానికి సమగ్ర ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఐటీఎల్ఏ జాతీయ స్థాయిలో రవాణా, లాజిస్టిక్స్ రంగాల సమగ్ర ప్రణాళికకు కేంద్ర సంస్థగా పనిచేయనుంది. రోడ్లు, రైల్వేలు, నౌకాశ్రయాలు, షిప్పింగ్, పౌర విమానయానం, అంతర్గత జలరవాణా, తీరప్రాంత రవాణా, పట్టణ రవాణా తదితర రంగాలను అనుసంధానిస్తూ పదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలానికి జాతీయ రవాణా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనుంది.

భారీ ప్రాజెక్టులపై పర్యవేక్షణ కేంద్ర ప్రభుత్వం చేపట్టే రూ.500 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ వ్యయంతో కూడిన మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఐటీఎల్ఏ సాంకేతిక పరిశీలన నిర్వహించనుంది. ప్రాజెక్టుల అమలు సమయంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సమన్వయం చేయడంతో పాటు, పనులు పూర్తైన తర్వాత వాటి ప్రభావాన్ని కూడా అంచనా వేయనుంది. రవాణా, లాజిస్టిక్స్‌కు సంబంధించిన వివిధ సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు జాతీయ రవాణా డేటా రిపాజిటరీని ఏర్పాటు చేయనున్నారు. జీఎస్‌టీఎన్ ఈ-వే బిల్లులు, ఫాస్టాగ్, వాహన్, జీపీఎస్ ఆధారిత వ్యవస్థలు, పట్టణ ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థల నుంచి సమాచారాన్ని సమీకరించి రవాణా ప్రణాళికలు, సరకు రవాణా మార్గాల విశ్లేషణకు వినియోగించనున్నారు. జాతీయ లాజిస్టిక్స్ విధానం-2022ను సమీక్షించడం, అవసరమైన మార్పులకు సూచనలు ఇవ్వడం, లాజిస్టిక్స్ రంగంలో శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం కూడా ఐటీఎల్ఏ బాధ్యతల్లో ఉండనున్నాయి. రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చడం, మల్టీమోడల్ అనుసంధానాన్ని బలోపేతం చేయడం, మౌలిక వసతుల సామర్థ్యాన్ని పెంచడం దీని ప్రధాన లక్ష్యాలుగా కేంద్రం పేర్కొంది.

ముంచుకొస్తున్న కరెంటు కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ రాష్ట్రాలు అదనపు విద్యుత్ కోరుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. వర్షపాతం తగ్గడంతో సెప్టెంబరులో గత ఏడాదితో పోలిస్తే జల విద్యుదుత్పత్తి 30 శాతం తగ్గింది. పవన విద్యుదుత్పత్తి కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సమస్య మరింత తీవ్రమైంది. **2023 తర్వాత అత్యధిక కొరత** విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిని పెంచినప్పటికీ కొరత కొనసాగుతోంది. ఈ ఏడాది సెప్టెంబరులో విద్యుత్ కొరత 560 మిలియన్ కిలోవాట్ గంటలకు చేరింది. 2023 ఆగస్టు తర్వాత ఇదే అత్యధిక కొరతగా నమోదైంది. సుమారు 41 గిగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ ప్లాంట్లలో ఉత్పత్తి నిలిచిపోయినట్లు గ్రిడ్ ఇండియా సమాచారం వెల్లడించింది. పగటిపూట సౌర విద్యుత్ అందుబాటులో ఉన్నప్పటికీ తగినంత బ్యాటరీ నిల్వలు లేకపోవడంతో సాయంత్రం, రాత్రి వేళల్లో డిమాండ్‌ను తీర్చడం కష్టమవుతోంది. పారిశ్రామిక డిమాండ్, వేడి వాతావరణం, తగ్గిన జలపవన విద్యుదుత్పత్తి, బొగ్గు ప్లాంట్ల నిర్వహణ పనులు సరఫరాడిమాండ్ మధ్య అంతరాన్ని పెంచుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పగటిపూట ఉత్పత్తయ్యే సౌర విద్యుత్‌ను బ్యాటరీల్లో నిల్వ చేసి రాత్రి వినియోగించుకునే విధానాన్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అదనపు విద్యుత్ సరఫరా కోసం రాష్ట్రాలు కేంద్రం వైపు చూస్తున్నాయి.

అమరావతి పనుల్లో వేగం పెంచాలి

•ప్రతి నెల రూ.2 వేల కోట్ల పనులు పూర్తయ్యేలా లక్ష్యాలు •152 ప్రాజెక్టుల్లో 41 వేల మంది కార్మికులు.. ఔటర్ రింగ్ రోడ్డు పనులపై ప్రత్యేక దృష్టి

అమరావతి,అక్టోబర్ 6(నేటి మినిట్ టు మినిట్): రాజధాని అమరావతి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి శరవేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను, నిర్మాణ సంస్థలను ఆదేశించారు. అమరావతి రాజధాని అభివృద్ధి పనులపై మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు రాజధానిలో వివిధ నిర్మాణ పనులు చేపడుతున్న ఏజెన్సీల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల వారీగా పనుల పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించి, నిర్మాణ పనులను నిర్దిష్ట లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్లేందుకు పలు సూచనలు చేశారు. గత నెలలో అమరావతిలో నిర్మాణ సంస్థలు రూ.1,345 కోట్ల విలువైన పనులను పూర్తి చేసినట్లు సమావేశంలో అధికారులు వివరించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు. ఇకపై ప్రతి నెలా కనీసం రూ.2 వేల కోట్ల విలువైన పనులు పూర్తయ్యేలా స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని



ముందుకు సాగాలని ఆదేశించారు. పనుల్లో ఎక్కడైనా జాప్యం జరుగుతున్నట్లయితే అందుకు గల కారణాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. **152 ప్రాజెక్టుల్లో 41 వేల మంది**రాజధాని అమరావతి పరిధిలో ప్రస్తుతం 152 ప్రాజెక్టుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ప్రాజెక్టులపై సుమారు 41 వేల మంది కార్మికులు పనిచేస్తున్నట్లు తెలిపారు. వివిధ నిర్మాణ సంస్థలు చేపడుతున్న పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన మానవ వనరులు, యంత్రాలు, ఇతర వసతులను సమకూర్చుకుని పనులను వేగవంతం చేయాలని సీఎం సూచించారు. రాజధాని నిర్మాణంలో ఒకేసారి అనేక కీలక ప్రాజెక్టులు కొనసాగుతున్న నేపథ్యంలో వాటి మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల నాణ్యత విషయంలో రాజీ లేకుండా, నిర్ణయించిన గడువుల్లోనే ప్రాజెక్టులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రాజెక్టు పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించుకునే విధంగా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. **ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రత్యేక దృష్టి** అమరావతి రాజధాని అభివృద్ధిలో కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును కూడా వేగంగా పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. కేంద్ర స్థాయిలో అవసరమైన అనుమతులు, ఇతర ప్రక్రియలను వేగంగా పూర్తి చేసేందుకు సంబంధిత శాఖలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు పూర్తయితే రాజధాని ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ఊతం లభించే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది.

పనుల పురోగతిపై సీఎం సమీక్ష సమీక్షా సమావేశంలో వివిధ నిర్మాణ సంస్థలు చేపడుతున్న పనుల ప్రస్తుత స్థితిగతులు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన పనులపై ముఖ్యమంత్రి వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టుల వారీగా పురోగతిని పరిశీలించి, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు అవసర మైన సూచనలు చేశారు. పనుల వేగాన్ని పెంచడంతో పాటు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

గోరంట్లలో సొంత నిధులతో అన్న క్యాంటీన్

(మొదటి పేజీ తరువాయి)

నాయుడు తిరిగి అన్న క్యాంటీన్లను ప్రారంభించి పేదల కడుపు నింపుతున్నారని అన్నారు. గతంలో పెనుకొండలో కూడా తన సొంత నిధులతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి వెయ్యి రోజుల పాటు పేదలకు సేవ చేసే అవకాశం లభించిందని తెలిపారు. గోరంట్లలో కూడా సొంత నిధులతో అన్న క్యాంటీన్ ప్రారంభించడం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్, ఆ పార్టీ నాయకులపై మంత్రి సవిత తీవ్ర విమర్శలు చేశారు. విధ్వంస రాజకీయాలకు స్వస్తి చెప్పి అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ చేశారు. ఏపీలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నం చేసినా ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ

● మడకశిర ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్





రోగి వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

మడకశిర, అక్టోబర్ 6(నేటి మినిట్ టు మినిట్): శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలు, వార్డులు, ఔషధ నిల్వ కేంద్రాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఇన్‌పేషెంట్, అవుట్‌పేషెంట్ వార్డులను సందర్శించిన కలెక్టర్ రోగులతో నేరుగా మాట్లాడారు. ఉచితంగా మందులు అందుతున్నాయా, వైద్యులు, సిబ్బంది సమయానికి అందుబాటులో ఉంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, శానిటరీ విభాగాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు.అనంతరం మందుల నిల్వలు, అత్యవసర మందుల లభ్యతను పరిశీలించి స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. మందుల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది సమయపాలన పాటిస్తూ అత్యవసర సమయాల్లో రోగులకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.**పేదలకు మెరుగైన వైద్యం అందించాలి** గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద రోగులకు మెరుగైన ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యమని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన సేవలు అందించాలని సూచించారు. సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అవసరమైన సౌకర్యాలను త్వరితగతిన మెరుగుపరిచేందుకు జిల్లా యంత్రాంగం తరఫున చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో మడకశిర ఆర్డీఓ ప్రసన్న లక్ష్మి, తహసీల్దార్ ముకుంద, స్థానిక డాక్టర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో ఉత్సవ కార్యక్రమం



దేవనకొండ అక్టోబర్ 6(నేటి మినిట్ టు మినిట్):ఆస్పరి ప్రాజెక్టు పరిధిలోని దేవనకొండ మండలం పల్లెదొడ్డి అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం, అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమాలను నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివలింగమ్మ పాల్గొని చిన్నారుల బరువు, ఎదుగుదల, పౌష్టికాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలు, చిన్నారుల ఎదుగుదల పర్యవేక్షణ, పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణ, తల్లీబిడ్డల సంక్షేమంపై వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మంగమ్మ, రంగమ్మ, మదర్స్ మీటింగ్‌కు హాజరైన తల్లులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రూ.1.20 కోట్లతో నూతన ఆర్డీఓ కార్యాలయం

- పాలనను ప్రజల చెంతకు చేర్చడమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి ఎస్. సవిత



మడకశిర, అక్టోబర్ 6(నేటి మినిట్ టు మినిట్): మడకశిర నియోజకవర్గ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన రెవెన్యూ సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. మడకశిర పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయ ఆవరణలో రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన ఆర్డీఓ కార్యాలయ భవనానికి మంగళవారం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, హిందూపురం ఎంపీ బి.కె. పార్థసారథి, ఎమ్మెల్యే ఎమ్.ఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మడకశిర ప్రజలు తమ పనుల కోసం పెనుగొండ ప్రాంతానికి వెళ్లాల్సిన ఇబ్బందులను తొలగించేందుకు నూతన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు.జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు రీసర్వే చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 165 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, మార్చి 2027 నాటికి మిగిలిన గ్రామాల్లో కూడా పూర్తి చేస్తామని చెప్పారు. ఇ-కేవైసీ ద్వారా వివరాలను పరిశీలించిన అనంతరం అర్హులైన భూ యజమానులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తామని తెలిపారు.ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ మడకశిర, అమరాపురం వంటి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి మరిన్ని నిధులు, టవర్లు తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. హంద్రీ-నీవా ద్వారా ఈ ప్రాంతానికి సాగునీరు, తాగునీరు అందించే చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఎమ్.ఎస్. రాజు మాట్లాడుతూ నియోజకవర్గ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందన్నారు.అనంతరం నూతన ఆర్డీఓ వాహనాన్ని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే ఎమ్.ఎస్. రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ప్రసన్న లక్ష్మి, తహసీల్దార్ ముకుంద, అధికారులు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, కూటమి నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక మంత్రి ఇలాకాలో.. పందుల మధ్య పాఠాలు.. ఎండలో భోజనాలు


సమస్యల వలయంలో విడపనకల్లు జెడ్పీ హైస్కూల్

పాఠశాల ప్రాంగణంలో యథేచ్ఛగా పందుల సంచారం

భోజనశాల లేక మండుటెండలోనే విద్యార్థుల భోజనం

ప్రభుత్వ మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభానికి నోచుకోలేదని ఆవేదన

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలి: ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్





ఎండలో కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

విడపనకల్లు అక్టోబర్ 6(నేటి మినిట్ టు మినిట్): విడపనకల్లు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. పాఠశాల ప్రాంగణంలో పందులు యథేచ్ఛగా సంచరిస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. **పాఠశాల ఆవరణలో పందుల స్వైర విహారం** ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాలను పరిశీలించిన నాయకులు అక్కడ నెలకొన్న సమస్యలను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో పందులు స్వేచ్ఛగా సంచరిస్తుండటంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొందని తెలిపారు. దీనివల్ల విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. **భోజనశాల లేక.. ఎండలోనే భోజనం** పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు ప్రత్యేక భోజనశాల లేకపోవడం పట్ల ఎస్ఎఫ్ఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మండుటెండలో విద్యార్థులు బయట కూర్చొని భోజనం చేయాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం తక్షణమే ప్రత్యేక భోజనశాలను నిర్మించాలని డిమాండ్ చేశారు.**మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించాలి** ప్రభుత్వం పాఠశాలకు అందజేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను వెంటనే ప్రారంభించి విద్యార్థులకు స్వచ్ఛ మైన తాగునీరు అందించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. పాఠశాలలోని ఇతర మౌలిక వసతుల సమస్యలను కూడా గుర్తించి తక్షణమే పరిష్కరించాలని అధికారులను డిమాండ్ చేశారు.**పేద విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి** ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు.



విద్యార్థుల మధ్య కుక్కలు, పందులు సంచారం

పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఓతూరు పరమేష్ అన్నారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పందుల సంచారాన్ని అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు సురక్షితమైన, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిమాండ్ చేశారు.**సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన** పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఓతూరు పరమేష్ హెచ్చరించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భీమేష్, సహాయ కార్యదర్శి ఎస్.ఎం. హరూన్ రషీద్, ఎస్ఎఫ్ఐ నియోజకవర్గ నాయకులు శివకుమార్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాయమైన ఎగువపల్లి - అగ్రహారం కలిసే వంక

వంకను కబ్జా చేస్తున్నారంటున్న గ్రామస్తులు

భారీ వర్షం వస్తే 500 కుటుంబాలకు వరద ముప్పు

ఐదారు అడుగుల ఎత్తులో మట్టితో పూడ్చివేత.. కోట్ల విలువైన భూములుగా మార్పు?

అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన లేదని ఆవేదన

అక్రమ కబ్జాలపై చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

గార్లదిన్నె: అక్టోబర్ 6(నేటి మినిట్ టు మినిట్): వర్షాకాలం వస్తే వరద నీటితో వణికిపోయే పరిస్థితి తమ గ్రామాలకు ఉందని గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని అగ్రహారం, ఎగువపల్లి గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న సహజ వంక ఆనవాళ్లు క్రమంగా కనుమరుగవుతున్నాయని, వంక స్థలాన్ని కొందరు ఆక్రమించి మట్టితో పూడ్చివేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.**పాత మ్యాపులో ఉంది.. కొత్త మ్యాపులో మాయమైంది**కల్లూరుఅగ్రహారం పొలాల మధ్య ఉన్న వంక పాత మ్యాపుల్లో స్పష్టంగా చూపించబడిందని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న ఎల్‌పీ నంబర్ మ్యాపులో వంకగా మార్కింగ్ లేకపోవడంతో కబ్జాదారులకు అవకాశం ఏర్పడిందని ఆరోపిస్తున్నారు.జాతీయ రహదారి-44 విస్తరణ, 6-వే పనుల అనంతరం వంక స్థలం మరింత ఆక్రమణకు గురైందని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా 280, 713 తదితర సర్వే నంబర్ల పరిధిలో వంక ఆనవాళ్లు కనిపించకుండా మట్టితో పూడ్చివేస్తున్నారని ఆరోపిస్తున్నారు. **కొండ మట్టి.. వంకకు పూడిక**జాతీయ రహదారి సమీ పంలోని కొం డలను భారీ యంత్రాలతో తవ్వి, ట్రిప్పర్ల ద్వారా మట్టిని తరలించి వంక స్థలాల్లో పోస్తున్నారని గ్రామ స్తులు ఆరోపిస్తున్నారు. ఐదా రు అడుగుల ఎత్తు వరకు మట్టితో పూడ్చి స్థలాలను వ్యాపార అవసరాలకు అను కూలంగా మా ర్చు కుంటున్నారని ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు.కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ, వంక స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. అక్రమ మట్టి తరలింపు, పూడ్చివేతలపై మైన్స్, రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.**వర్షం వస్తే వరద ఉధృతి**ఎగువపల్లి ఫారెస్ట్ కొండల నుంచి వర్షపు నీరు పొలాల మీదుగా ఈ వంకలోకి భారీగా చేరుతుందని కల్లూరు గ్రామస్తులు చెబుతున్నారు. అదేవిధంగా ఎగువపల్లి సమీపంలోని 40506 కెనాల్ నుంచి వచ్చే నీటితో పాటు 4, 5, 6వ డిస్ట్రిబ్యూటరీ కాలువల నీరు కూడా వంకలోకి చేరుతుందని పేర్కొన్నారు.వంక సహజ ప్రవాహ మార్గం దెబ్బతింటే వరద నీరు కల్లూరు ఆర్ఎస్ గ్రామం, అగ్రహారం ప్రాంతాల వైపు మళ్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





వంకలో అక్రమంగా కట్టడాలు



వర్షం వస్తే ఇది పరిస్థితి

2022లో ఇళ్లలోకి వరద నీరుగతంలో 2022 సంవత్సరంలో భారీ వర్షాల సమయంలో వరద నీరు ఇళ్లలోకి ప్రవేశించిందని గ్రామస్తులు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం వంకను పూడ్చివేస్తే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు.అగ్రహారం ప్రాంతంలోని సుమారు 193 గృహాలు, పంచాయతీ కార్యాలయం, విజయ్ భాస్కర్ రైస్ మిల్లు, వాయుపుత్ర రైస్ మిల్లు, రాధాకృష్ణయ్య ఫ్యాక్టరీ, కాలనీ ప్రాంతాలు, దుర్గా రైస్ మిల్లు తదితర ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు. **అధికారులకు మొరపెట్టుకున్నా.. స్పందన కరువు**44వ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న వంక కావడంతో సమస్య తీవ్రతను అధికారుల దృష్టికి తీసుకెళ్లామని గ్రామస్తులు తెలిపారు. రెవెన్యూ శాఖ అధికారులు, పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.“వర్షం వచ్చి గ్రామాలు మునిగిపోయిన తర్వాత అధికారులు స్పందిస్తారా?“ అంటూ ప్రశ్నిస్తున్నారు. **మైన్స్ అధికారులు చర్యలు తీసుకోవాలి**కొండలను తవ్వి మట్టిని తరలించడం, వంక స్థలాలను పూడ్చివేయడం వంటి చర్యలపై జిల్లా ఉన్నతాధికారులు, మైన్స్ శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమంగా తరలించిన మట్టి విలువను అంచనా వేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రాయల్టీ, భారీ జరిమానాలు విధించాలని డిమాండ్ చేస్తున్నారు. **500 కుటుంబాలకు ముప్పు.. ముందే మేల్కొనాలి!**భారీ వర్షాలు కురిసే సమయంలో వంక సహజ ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడితే కల్లూరు, అగ్రహారం గ్రామాల్లో సుమారు 500 కుటుంబాలు వరద ముప్పును ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వంకను పూడ్చివేస్తే వరదను ఆపగలరా? అని ప్రశ్నిస్తున్న గ్రామస్తులు.. అధికారులు ఇప్పటికైనా స్పందించి వంకను సర్వే చేయించి, ఆక్రమణలను తొలగించి, సహజ నీటి ప్రవాహానికి మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు.**“వంకను కాపాడండి.. మా గ్రామాలను వరద ముప్పు నుంచి రక్షించండి“** జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వంక హద్దులను గుర్తించాలని, ఆక్రమణలు నిజమైతే తొలగించాలని, అక్రమంగా మట్టి తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని కల్లూరుఅగ్రహారం గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



గ్రామస్తులు దుస్థితి

అనంతలోకి ఎంట్రీ అయితే.. అనంత లోకాలకేనా?

● నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ.. తరచూ ప్రమాదాలు ● స్పీడ్ బ్రేకర్లు, సైన్ బోర్డులు లేక వాహనదారులకు ఇబ్బందులు ● ఉదయం.. సాయంత్రం మాత్రమే కనిపిస్తున్న ట్రాఫిక్ పోలీసులు ● డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉన్న శ్రద్ధ.. ప్రజల ప్రాణాలపై ఎందుకు లేదు?

అనంతపురం, అక్టోబర్ 6(నేటి మినిట్ టు మినిట్): అనంతపురం నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నప్పటికీ వాటి నివారణకు శాశ్వత చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం స్పీడ్ బ్రేకర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **ఉదయం.. సాయంత్రం మాత్రమే ట్రాఫిక్ పోలీసులు**నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉండాల్సి ఉండగా.. ఉదయం, సాయంత్రం సమయాల్లో మాత్రమే కనిపిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ప్రధాన కూడళ్ల వద్ద సరైన ట్రాఫిక్ సిగ్నలింగ్, సైన్ బోర్డులు లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు దారితప్పే పరిస్థితి నెలకొంటోందని చెబుతున్నారు. **డ్రంక్ అండ్ డ్రైవ్‌పై శ్రద్ధ.. ప్రమాదాల నివారణపై ఎందుకు లేదు?**డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను పట్టుకోవడంలో చూపుతున్న శ్రద్ధను ప్రమాదాల నివారణపై కూడా చూపించాలని ప్రజలు కోరుతున్నారు. “మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని పట్టుకోవాలనే ఆలోచన ఉంది.. మరి రోడ్డు ప్రమాదాల్లో ప్రజల ప్రాణాలను కాపాడాలనే ఆలోచన ఎందుకు లేదు?“ అంటూ ట్రాఫిక్ పోలీసుల తీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. **కళ్యాణదుర్గం సర్కిల్ వద్ద ట్రాఫిక్ కష్టాలు** నగరంలోని కళ్యాణదుర్గం సర్కిల్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రంగా ఉందని వాహనదారులు చెబుతున్నారు. నగరం నుంచి రూరల్ ప్రాంతాలకు వెళ్లాలంటే ట్రాఫిక్ రద్దీ కారణంగా సుమారు గంటన్నర సమయం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **కలెక్టరేట్ నుంచి పంగల్ రోడ్డు వరకు.. ప్రమాదాలకు కేరాఫ్** కలెక్టర్ కార్యాలయం రోడ్డు నుంచి



పంగల్ రోడ్డు వరకు ఉన్న రహదారి అత్యంత ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని నియంత్రిస్తే ప్రమాదాలను కొంతమేర తగ్గించవచ్చని ప్రజలు చెబుతున్నారు. **ఫిర్యాదులు చేసినా.. స్పందన కరువు** ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం కనిపించడం లేదని వాపోతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత హడావుడి చేయడం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. **నిద్రపోతున్న రాజకీయ నాయకులు?** ఎన్నికల సమయంలో ఓట్ల కోసం రకరకాల హామీలు ఇచ్చే రాజకీయ నాయకులు.. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన విషయాన్ని మాత్రం మర్చిపోతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. రోడ్ల దుస్థితి, ట్రాఫిక్ సమస్యలు, వరుస ప్రమాదాలు నాయకులకు కనిపించడం లేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. “ఓట్ల సమయంలో ఎన్నో హామీలు ఇస్తారు.. గెలిచిన తర్వాత ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదు?“ అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. **రోడ్డెక్కేందుకు సిద్ధమవుతున్న ప్రజలు** నగరంలో వరుసగా జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ప్రజలను సమీకరించి రోడ్డుపై ధర్నాకు దిగేందుకు సిద్ధమవుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. “ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు స్పందించరా? ఇకనైనా చర్యలు తీసుకుంటారా.. లేక ప్రజల ప్రాణాలను పెడచెవిన పెడతారా?“ అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. **“అనంతలోకి ఎంట్రీ అయితే.. అనంత లోకాలకేనా?“** ప్రమాదకరంగా మారిన రహదారులు, పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, సరైన సైన్ బోర్డులు లేకపోవడం, స్పీడ్



ప్రమాద సమయంలో మృతి, దృశ్యాలు

బ్రేకర్లు లేకపోవడం, ట్రాఫిక్ నియంత్రణలో లోపాలపై ప్రజలు వ్యంగ్యంగా స్పందిస్తున్నారు. “అనంతపురంలోకి ఎంట్రీ అయితే.. అనంత లోకాలకేనా?“ అంటూ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు. **ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు** యూటర్న్ తీసుకుంటుండగా బైక్‌ను ఢీకొన్న పుట్టపర్తి డిపో బస్సు అనంతపురం రూరల్ పరిధిలోని టీవీ టవర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పుట్టపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో శ్రీనివాసులు అనే వ్యక్తి మృతి చెందగా, ఆయన తమ్ముడు తీవ్రంగా గాయపడ్డారు. **కోళ్లు తీసుకురావడానికి వెళ్లి.. తిరిగి వస్తుండగా ప్రమాదం** కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాప్తాడు నియోజకవర్గానికి చెందిన శ్రీనివాసులు తన తమ్ముడితో కలిసి కోళ్లు తీసుకురావడానికి బైక్‌పై వెళ్లారు. టీవీ టవర్ సమీపంలో యూటర్న్ తీసుకుంటున్న సమయంలో పుట్టపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు మృతి చెందగా, ఆయన తమ్ముడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. **ఆర్టీసీ బస్సుల అతివేగంపై స్థానికుల ఆందోళన** అనంతపురం కలెక్టరేట్ నుంచి పగడాల రోడ్డు వరకు ఆర్టీసీ బస్సులు అతివేగంగా ప్రయాణిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్పీడ్ బ్రేకర్లను సైతం లెక్కచేయకుండా బస్సులు వేగంగా వెళ్తున్నాయని వారు పేర్కొన్నారు. **పలుమార్లు ఫిర్యాదులు.. అయినా చర్యలు శూన్యం** బస్సుల అతివేగంపై ఆర్టీసీ డిపో అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటున్నారని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బస్సుల వేగాన్ని నియంత్రించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతుడు శ్రీనివాస్

మట్టి మాఫియా ఎంట్రీతో...గుట్టుగా గుట్టలు ఖాళీ...

కట్టలు కట్టలుగా డబ్బులు..?



శింగనమల నియోజకవర్గంలో మట్టి దందా

అధికార దుర్వినియోగంతో గుట్టుగా గుట్టలు ఖాళీ... పోలీసులైన ‘ వి డోంట్ కేర్ ‘ అంటున్న వారు ఎవరు...?


హిటాచి పై ఎందుకు కేసు కట్టలేదు...?

ఎవరేం చేసినా 24 గంటల్లో బయటికి తెస్తాం బయటికి వస్తాం అంటున్న వారు ఎవరు...?

నల్లమట్టి తవ్వకాలు, రవాణాపై అధికారుల నిఘా ఎక్కడ?

పట్టుబడుతున్న వాహనాలు.. కేసుల నమోదులో మాత్రం జాప్యం?

శింగనమల: అక్టోబర్ 6(నేటి మినిట్ టు మినిట్): నియోజకవర్గంలో నల్లమట్టి తవ్వకాలు, రవాణా వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. కేకే అగ్రహారం నుంచి ఉప్పరపల్లి వైపు సుమారు 100 టిప్పర్లలో నల్లమట్టి రవాణా జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో మట్టి తవ్వకాలకు ఉపయోగిస్తున్న హిటాచి యంత్రం పట్టుబడిన ప్పటికీ, దానిపై కేసు నమోదు చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. **ఒకే హిటాచి.. మళ్లీ మళ్లీ పట్టుబడినా?**ఇదే హిటాచి గతంలోనూ నల్లమట్టి తవ్వుతూ పట్టుబడినట్లు స్థానికులు చెబుతున్నారు. గతంలో పట్టుబడినప్పటికీ ఇప్పటివరకు అదే యంత్రంపై కేసు నమోదు కాలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ఒకే యంత్రం వరుసగా ఇలాంటి వ్యవహారాల్లో కనిపిస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. **నియోజకవర్గం అంతటా తవ్వకాలు?**సింగనమలలోని పలు ప్రాంతాల్లో నల్లమట్టి, ఇసుక తవ్వకాలు పెద్దఎత్తున జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. అనుమతులు, పర్మిట్లు, నిబంధనలకు అనుగుణంగా తవ్వకాలు జరుగుతున్నాయా లేదా అన్నదానిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. **మట్టితో రాజకీయం.. ఇసుకతో ఇష్టానుసారం..?**నల్లమట్టి, ఇసుక రవాణా వ్యవహారాలు కేవలం వ్యాపారానికే పరిమితం కాకుండా రాజకీయ రంగు పులుముకుంటు న్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మట్టి రవాణా ద్వారా లక్షల రూపాయల వ్యాపారం జరుగుతోందని, వాహనాలు పట్టుబడిన సందర్భాల్లో రాజకీయ పలుకుబడిని ఉపయోగించి వ్యవహారాలను చక్కదిద్దుతున్నారనే విమర్శలు ఉన్నాయి.**వాహనాలు పట్టుబడితే రాయబారాలా?** మట్టి, ఇసుక రవాణా చేస్తున్న వాహనాలు పట్టుబడిన సమయంలో కొంతమంది రాజకీయ నేతలు అధికారులతో రాయబారాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొందరు పోలీసు సిబ్బంది సైతం అక్రమ రవాణాదారులకు వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు ఉన్నాయి. **ఉన్నతాధికారులు స్పందించాలి** నిబంధనలకు విరుద్ధంగా నల్లమ ట్టి, ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయా? అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న వాహనాలపై ఎన్ని కేసులు నమోదయ్యాయి? గతంలో పట్టుబడిన అదే హిటాచిపై ఎందుకు చర్యలు తీసుకో లేదనే అంశాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని స్థానికు లు కోరుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేలా అక్రమ త వ్వకాలు జరుగుతున్నాయా అనే కోణంలో సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




నల్ల మట్టి తోవ్వుతూ పట్టుబడ్డ హిటాచి, ఇంకా ఈ హిటాచి పైన కేసు బుక్ చేయలేదు అంటూ విశ్వసనీయ వర్గాల సమాచారం...?

విచారణ సాగుతుందా? లేక సాగదీస్తున్నారా...?

● ఏపీఓ సుజాతపై వచ్చిన ఆరోపణలపై విచారణ ఎప్పుడు ప్రారంభమైంది? ● విచారణలో ఇప్పటివరకు ఏం తేలింది? ● ఫోన్‌పే స్క్రీన్‌షాట్లను అధికారులు పరిశీలించారా? ● ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? ● ఈ వ్యవహారం వెనుక మరెవరైనా ఉన్నారా? ● విచారణ పూర్తయ్యే గడువు ఎంత? ● ఉపాధి హామీలో అక్రమాల ఆరోపణలు ● ఏపీఓ సుజాతపై భారీగా డబ్బులు వసూలు చేశారంటూ ఆరోపణలు ● ఫోన్‌పే స్క్రీన్‌షాట్లు ఉన్నాయంటున్న బాధితులు.. అయినా చర్యలు శూన్యమేనా?

శింగనమల:అక్టోబర్ 6(నేటి మినిట్ టు మినిట్): ఉపాధి హామీ పథకంలో భారీగా డబ్బులు వసూలు చేశారంటూ ఏపీఓ సుజాతపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆమెపై విచారణ కొనసాగుతోందని పీడీ వెల్లడించినట్లు సమాచారం. అయితే ఆరోపణలకు సంబంధించిన ఆధారాలుగా ఫోన్‌పే లావాదేవీల స్క్రీన్‌షాట్లు ఉన్నాయని చెబుతున్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై కూలీలు, స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.**ఆధారాలు ఉన్నా.. చర్యలు ఎందుకు లేవు?**తమ వద్ద ఫోన్‌పే లావాదేవీలకు సంబంధించిన స్క్రీన్‌షాట్లు ఉన్నాయని, డబ్బుల వసూళ్లకు సంబంధించిన వివరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పలువురు చెబుతున్నారు. ఆరోపణలు ఇంత స్పష్టంగా ఉండి, ఆధారాలు ఉన్నాయని చెబుతున్న పరిస్థితుల్లోనూ కేవలం విచారణ పేరుతో కాలయాపన ఎందుకనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.“కళ్లకు కట్టినట్లు ఆధారాలు ఉన్నప్పుడు చర్యలు తీసుకోకుండా విచారణ పేరుతో జాప్యం ఎందుకు?” అంటూ కూలీలు, ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు.**ఉపాధి హామీ పనుల్లో అసలు ఏం జరుగుతోంది?**పేద కూలీలకు ఉపాధి కల్పించి వారికి ఆర్థికంగా అండగా నిలవాల్సిన ఉపాధి హామీ పథకంలో అక్రమ వసూళ్లకు తావు ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భారీగా డబ్బులు వసూలు చేశారంటూ ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కూలీలు కోరుతున్నారు. **ఎంక్వయిరీ ఎక్కడ..?**ఏపీఓపై విచారణ కొనసాగుతోందని పీడీ



ఫోన్ పే స్క్రీన్ షాట్స్ పదుల సంఖ్యలో



చెబుతున్నప్పటికీ, విచారణ ఏ దశలో ఉంది? ఎప్పటిలోగా పూర్తవుతుంది? ఇప్పటివరకు ఏం తేలింది? అనే ప్రశ్నలకు స్పష్టత లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఈ విషయంపై సమాచారం కోసం పీడీని సంప్రదించేందుకు ప్రయత్నించగా, తాను ఔట్ ఆఫ్ స్టేషన్‌లో ఉన్నానంటూ సమాధానం ఇచ్చినట్లు సమాచారం. అయితే ఇంత పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చిన వ్యవహారంలో ప్రజలకు స్పష్టమైన సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు అంటున్నారు.**చర్యలు తీసుకుంటే.. పెద్దల పేర్లు బయటకొస్తాయా?**ఏపీఓ సుజాతపై ఆరోపణల నేపథ్యంలో వెంటనే చర్యలు తీసుకుంటే, ఈ వ్యవహారం వెనుక మరికొందరి పాత్రలు కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే చర్చ స్థానికంగా సాగుతోంది. అయితే ఇవన్నీ ఆరోపణలు మాత్రమేనని, సమగ్ర విచారణ ద్వారానే వాస్తవాలు తేలాల్సి ఉందని పలువురు పేర్కొంటున్నారు.**“పెద్ద తిమింగలాలను బయటకు తీయాలి”**ఉపాధి హామీ పథకంలో కూలీలకు చెందాల్సిన నిధులు దుర్వినియోగం అయ్యాయా? ఎవరెవరి ప్రమేయం ఉంది? డబ్బుల వసూళ్ల వెనుక అసలు వ్యవస్థ ఏంటి? అనే అంశాలపై లోతైన విచారణ జరపాలని కూలీలు, ప్రజలు డిమాండ్ చేస్తున్నా రు. ఫోన్‌పే లావాదేవీల స్క్రీన్‌షాట్లు సహా అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వ్యవహారం వెనుక ఉన్న పెద్దల పాత్ర ఏదైనా ఉంటే వారినీ వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరు తున్నారు,పీడీ సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు మరి ఎన్నో...?

M/S SUNIL PUBLICATIONSPrinting Press (Name & Address)PrinterM/S SUNIL PUBLICATIONS D.NO.: 28-5-782, HOUSING BOARD COLONY, REVENUE WARD NO. 28, ANANTAPUR., ANDHRA PRADESH - 515001.